"అమ్మా! పవన్‌గాణ్ణి టీపొడి తేరా అంటే అస్సాం వెళ్ళినట్లున్నాడు. ఇంకా రాడేం? మంజు కాఫీ తాగదు. వెధవన్నర వెధవ! ఎక్కడికెడితే అక్కడే! ఫెవికాల్ పూసినట్టు అతుక్కుపోతాడు. మనిషి కనబడితే చాలు మాటలతో అల్లుకుపోతాడు. పేట రాజకీయాలనుంచి ప్రపంచ రాజకీయల దాకా అన్నీ వాగితే తప్ప వాడికి తోచదు." ఇంకా సణుగుతూనే ఉంది సువర్ణ తమ్ముడి మీద.

"అబ్బ ఏమిటా విసురు? వస్తాడులే. బయటికెళ్ళిన వాడికి కాస్త టైమ్ ఇవ్వాలి. నువ్వూ, నీ ఫ్రెండ్స్ కాస్త టిఫిన్ తినండి. ఈలోగా వాడు వస్తాడు."

"ఫోమ్మా! ఒకటే తిండి. తినీ తినీ నీరసం వస్తోంది. మంజు, మాలూ ఇప్పుడే భోజనం చేసి వచ్చారుట. టిఫిన్ వద్దంటున్నారు. టీ అయితే హాయిగా రిలాక్స్ అవచ్చు. వచ్చావుట్రా! అస్సాం వెళ్ళిన వాడివి ఇంత త్వరగా వస్తావనుకోలేదు. రైల్లో అయితే మూడు రోజులు పోను మూడు రోజులు రానూటగా! ప్లేన్లోగాని వెళ్ళావా? అయినా అయిదారు గంటలు పడుతుంటే. ఓహో! రాకెట్‌లో వెళ్ళి వచ్చుంటావులే! అరగంటలో వచ్చేశావు."

"అబ్బ పోవే! తెచ్చిందే ఎక్కువైందంటే బో సాధింపూ, నువ్వూను! ఫ్రెండ్స్ ఎదురుగుండా పెద్ద ఫోజు. అది తేరా ఇది తేరా అని బతిమాలి ఊడిగం చేయించుకుంటావు. పైగా వెటకారం నువ్వూను. ఇంకెక్కడికైనా వెళ్ళమను దవడూడగొడతా చూడు." పవన్ విసురుగా అన్నాడు.

"ఒరే! పవనాయ్! ఏమిటా నోటి దురుసు? అక్కనల్లాగేనా అనటం. నువ్వేమిటే టూటీ! వాణ్ణంటే వాడూరుకుంటాడా? పని చేయించుకొని పైగా వాణ్ణి దెప్పుతావెందుకు? ఇంకా టైమ్ పోగొట్టుకుంటున్నావు. వెళ్ళి టీ చెయ్యి పో! మీకు సినిమా టైమ్ అయిపోతోంది అసలే మాట్నీకి టిక్కెట్లు దొరకవు. వాణ్ణి కారాడుకు తినటంతోటే సరిపోతోంది నీకు. ఇదే కాబోలు టీ కప్పులో తుఫాన్ అంటే!" తల్లి కూతుర్ని కోప్పడింది.

"ఈ బ్రహ్మరాక్షసికి ఇంకో బ్రహ్మరాక్షసుణ్ణి అంటగట్టి ఇంట్లోంచి గెంటెయ్. నేనూ చెల్లాయ్ హాయిగా ఉంటాం." అమ్మ సపోర్టుకి మురిసిపోతూ అన్నాడు.

"నోర్మూయ్! అతిగా వాగకు." సువర్ణ ఉడుక్కుంది.

"ఏవిటే సువర్ణా! మీ తమ్ముడితో అట్లా పోట్లాడుతున్నావే?" మంజు నవ్వింది. "చూడమ్మా అది డిగ్రీ ఫైనలియర్. వీడేమో ఇంటరు ఫస్టియరు. గజకచ్ఛపాల్లాగా ఎల్లా పోట్లాడుకుంటున్నారో చూశావుగా! ఎవరూ తగ్గరు. నాకేమో వీళ్ళ గొడవలతో మతిపోతోంది. ఇద్దరికీ నచ్చచెప్పలేక ప్రాణంమీదకొస్తోంది."

స్నేహితురాళ్ళు ముగ్గురూ సినిమాకి వెళ్ళారు.

రొటీన్ కథ. ఇద్దరు హీరోయిన్లు, ఒక హీరో. ఒక క్లబ్బు డాన్సు, కొన్ని ఫైటింగులు. రెండర్థాలొచ్చే డైలాగులు వగైరా వగైరా. హీరో బోలెడంతమంది విలన్లని హెలికాప్టరులో, కారులో, జీపులో, మోటారు సైకిలు మీద, చివరికి పరుగులతో వెంటాడి పట్టుకొని బావదన్ని చెవులు మూస్తుంటే పోలీసులు వచ్చి మెచ్చుకొని కరచాలనం చేస్తారు. త్యాగం చేసిన హీరోయిన్ హీరో చేతిని రెండో హీరోయిన్ చేతిలో పెట్టి బక్కెట్ తన్నేస్తుంది. హీరో హీరోయిన్లు ఏడుపుముఖాలతో ప్రేక్షకులకి దండం పెడతారు. ఇల్లా ఆ సినిమ దుఃఖసుఖాంతం అవుతుంది.

"మంజూ, ఫెరోజ్ పార్కులో కాస్సేపు కూర్చుని వెడదామే! ఏమంటావు సువర్ణా!" అప్పుడే ఇంటికి వెళ్ళటానికి ఇష్టపడని మాలతి అడిగింది.

"ఓకె! నాకేం అభ్యంతరం లేదు. ఇంటికెడితే మా కోతిగాడు అంటే మా పవన్‌గాడు తగులుకుంటాడు. ఇందాక మీరున్నారని కాస్త స్పేర్ చేశాడు. నేనొక్కదాన్నీ ఉంటే వెధవ! బలే టీజ్ చేసి చంపుతాడు. మాఅమ్మని చూస్తే జాలేస్తుంది. పాపం! ఇద్దరికీ నచ్చచెపుతూ ఉంటుంది."

"సువర్ణా! నీకు ప్రాబ్లెమ్స్ అంటూ ఏవీ లేవా?" మాలతి అడిగిన ప్రశ్నకి సువర్ణ ఆశ్చర్యపోయింది.


"అంటే?"


"అంటే కుటుంబసమస్యలు, చికాకులు, బాధలు, లాంటివి."

"లేకేం! బోలెడు. చెబ్తున్నాగా! మాపవన్ బాబే నాకో పెద్ద సమస్య. వాడు మాచెల్లాయినో, నన్నో ఏడిపిస్తూనే ఉంటాడు. కుందేలు అనో కుక్కపిల్ల అనో ఏదో అంటుంటాడు. విననుమొర్రో అన్నా సరే వాళ్ళ కాలేజీ జోక్స్ చెబుతాడు. ఆ రోజు జరిగిన విషయాలనీ కథలు కథలుగా చెబుతానంటాడు. వినకపోతే మొరటువెధవ! కరాటే వెధవ! చేతులు గట్టిగా పట్టేసి కదలనీకుండా చేసి వినిపిస్తాడు. వాడితో అదో గోల! మా అమ్మతో కొన్ని సమస్యలు. వంటావిడని పిన్నిగారూ అనమంటుంది. ఛస్తేనే ననను. ఆవిడేదో మా నాయనమ్మ లాగా ఇది తప్పమ్మా! అది ముప్పమ్మా! అంటూ నీతిబోధ చేస్తుంది. ట్రాష్. ఆవిణ్ణి చూస్తూనే నాకు ఒళ్ళు మండుతుంది. నేను విసుక్కుంటే మాతమ్ముడొకడు ముక్కు మీద కోపం నీ ముఖానికే అందం అంటూ పాట అందుకుంటాడు. చాచి లెంపకాయ కొట్టాలనిపిస్తుంది. వెధవ పారిపోతాడు. అబ్బబ్బ సినిమా పాటలతో వేధిస్తాడనుకో. స్నానం చేస్తుంటే త్వరగా రమ్మని అరుస్తాడు. జలకాలాటలలో కిలకిలపాటలతో' అనీ, నా పుట్టినరోజు నాడు మరి పుట్టింది ఎందుకో తెలిసేది ఎందరికీ అనీ ఇల్లా ఎన్నో పాటలు పాడి విసిగిస్తాడు. అసలు సినిమా పాటలంటేనే అసహ్యం వేస్తోంది వాడి వల్ల. ఇంక మాచెల్లెలు సంగతి- నా రబ్బరుబాండ్లు, నా క్లిప్పులు, నా చెప్పులు కావాలి. 'అక్కా నీ మాచింగ్ లంగా ఇవ్వవే ప్లీజ్' అంటూ లంగాలు కర్చీఫ్‌లు, గోళ్ళరంగు ఇది అదీ అనే మిటి అన్నీ వాడేస్తుంది. అదేవిటంటే 'అది అమ్మ

# ఒక మంచి మిగిలితే చాలు!

కుసుమ. కె. మూర్తి





'కొంది. ఇది నాన్న కొన్నారు. దీనిమీద నీ కెంత హక్కుందో నాకూ అంతే ఉంది' అంటుంది. అంత చిన్నది దాని కంత పొగరు. చూడు ఎన్ని సమస్యలో?"

"ఇవా నీ సమస్యలు సువర్ణా?" మాలతి ఆశ్చర్యానికి మారుపేరుగా ఉంది. మంజుల చూపు ఆకాశం, భూమీ కలిసిన చోట ఆగిపోయి ఇహ వెనక్కి రానంటోంది.

"మాలూ! ఇవన్నీ డేటుడే సమస్యలు కావా? ఆ మాట కొస్తే మినిట్ టు మినిట్ సమస్యలు కావంటావా?"

"మాలా! జవాబియ్యవేమే? సరే పోనీ నీ సమస్యలేమిటో చెప్పు. మూ డేళ్ళనుంచి కలిసి చదువుకుంటున్నా ఒకళ్ళ కుటుంబం గురించి మరొకళ్ళకి తెలీనే తెలీదు." సువర్ణ మాలతిని అడిగింది.

మాలతి ఏం మాట్లాడలేదు. కాలి బొటనవేలు నేలకేసి రాస్తూ తలొంచుకుని కూర్చుండిపోయింది.

"చెప్పవే మాలూ! ఏంటలా నోరు బిడయించుకు కూర్చున్నావు."

"ఉహు ఏం లేదు. సమస్యలేం ఉంటాయి?" నసిగింది మాలతి.

"చెప్తావా? తన్నమంటావా? మంజూ! అసలు టాపిక్ మొదలెట్టిందెవరే?"

"చెప్పవే మనలో మనకి రహస్యాలేమిటి? వీధికి చాటింపు వే సే వాళ్ళెవరున్నా రిక్కడ?" మంజు ప్రోత్సహించింది.

"వెలికిరాని మాటలు.
నలిగి అణగారిపోతాయి.
పలికిన పలుకులు మాత్రం
చిత్రమైన కథలవుతాయి."

మాలతి తన సహజమైన కవితా ధోరణిలో అంది.

"ఓహో కవయిత్రీ! పాతచింతకాయ పచ్చడీ! ఇంక చాల్లే! మహా వెలిగిపోయావు. నేనూ చెబుతాను సవాలక్ష సామెతలు.

కుండముయ్య మూ కుడుంది గాని నోరు ముయ్య మూ కుడు లేదు.

గుప్పిట విప్పితే గుట్టంతా రట్టవుతుంది.

గుండెలో వేదన గొంతు దాటకూడదు.

ఇంట్లో పోరున్నా ఇల్కెక్కి చాటకూడదు. చాలా? ఇంకా చెప్పమంటావా? అర్థమైనవాళ్ళకి చెప్పకూడదు కాని, ఒకళ్ళో ఇద్దరో ముఖ్యులు, నమ్మకమైన వాళ్ళకీ చెప్పకపోతే ఎట్లాగే? నీ సమస్యలని తీర్చలేకపోయినా కాస్తంత ఊరట కలిగించగలం. ధైర్యం చెప్పగలం. కనీసం సానుభూతి అయినా చూపించగలం. ప్రామిస్! ఎవ్వరికీ చెప్పంగా? చెప్పి కాస్త బరువు తగించుకో మాలూ?"

బతిమాలే ధోరణిలో అంది సువర్ణ.



"సరే మీ కంత సరదాగా ఉంటే వినండి. మా సొంతఇల్లు ఇక్కడికి నలభైకిలోమీటర్ల దూరంలో ఉంది. రోజూ అంత దూరం ప్రయాణించడం కుదరదు కనుక ఇక్కడే మాపిన్ని ఇంట్లో ఉంటున్నాను. బాలవితంతువైన మా పిన్ని మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. మా అమ్మకి తోటికోడలైనా సొంత అక్కలాగా చూసుకొంటుంది. ఇక్కడే టీచరుగా పని చేస్తోంది."

"ఆమె చెడ్డదా? నిన్ను కాల్చుకు తింటుందా?" సువర్ణ గబుక్కున అడిగింది.

"కాదు చాలా మంచిది. నాకు ప్రపంచం తీరుతెన్నులు చెప్తుంది. రాజకీయాలు ప్రస్తావిస్తుంది. సాంఘికదురాచారాలు, వాటిని ఎట్లా రూపుమాపాలో-అందులో స్త్రీల పాత్ర ఏమిటో చర్చిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తనతో కూర్చుని కబుర్లు చెబుతుంటే ఎన్ సైక్లోపీడియా చదివినట్టే. తనొక విజ్ఞానఖని."

"మరింకేమిటీ నీ ప్రాబ్లెమ్?"

"నా ప్రాబ్లెమల్లా మా సొంత కుటుంబమే." పదిహేనేళ్ళ క్రితమే మా నాన్నగారు ఇంట్లోంచి వెళ్ళిపోయారు. ఎందుకు వెళ్ళిపోయారో, ఎక్కడికి వెళ్ళిపోయారో ఎవరికీ తెలియదు. ఈ రోజువరకు ఒక్క ఉత్తరంముక్కకూడా రాయలేదు. బంధువులూ, స్నేహితులూ ఎవ్వరూకూడా ఆయన్ని చూడలేదు. పోలీసు కంప్లెయింట్ ఇచ్చారు. లాభం లేకపోయింది. అప్పటికే మా అమ్మ పదవక్లాసు పాసయింది. టైపు షార్టుహాండు నేర్చుకొని క్లర్కుగా చేరి మాఅన్నయ్య లిద్దర్నీ చదివించింది. సమర్థతకి మారుపేరు మాఅమ్మ. ఎంతటి వడగాలులకి వడలలేదు. అబలకాదు. సబల అనిపించుకొంది. వాయిదాలమీద కుట్టుమిషను కొని కుట్టుపని నేర్చుకొని మా బట్టలన్నీ మా అమ్మకుట్టేది. మా అన్నయ్యలతోపాటు చుట్టుపక్కల కుర్రాళ్ళకి ట్యూషన్లు చెప్పి డబ్బు సంపాదించేది. తెల్లారగట్ల అయిదు గంటలనుంచీ రాత్రి పదకొండు గంటల దాకా యంత్రంలా పనిచేసేది. జీవితం ఒక తపస్సులాగా గడిపింది. విజ్ఞానాన్ని ఆర్జించటం, పంచటం తప్ప వినోదం అంటే ఏమిటో తెలీకుండా గడిపింది. సోది చెప్పటం, సోది వినటం అదే పనికిమాలిన కబుర్లన్నమాట! చెడు ప్రచారం చెయ్యటం, కాలాన్ని వృథా చెయ్యటం లాంటి అలవాట్లని అమ్మ గర్హించింది. అమ్మా నాన్నా తనే అయి మమ్మల్ని పెంచింది.

"అందమైన గులాబిని కాళ్ళకింద వడేసి తొక్కి నలిపెయ్యటం కొందరికి సరదా. మాఅమ్మ శీలాన్ని అపహరించాలని కొందరు ప్రయత్నించారు. కొందరు అమ్మ శీలాన్ని శంకించారు. అల్లాగని ప్రచారం చేశారు.

"మీ ఆయన పోయాడేమో! ఇంకా బొట్టు, గాజులు, మంగళసూత్రం ఎందుకు? తీ సెయ్యమని కొందరు వేధించారు. మా అమ్మ దేనికీ చలించలేదు. లోన్ తీసుకొని, చీటీలు కట్టి నానా అవస్థలూ పడి ఇల్లు కూడా కట్టింది. నా పేరిట స్థలం కొంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసింది. పెద్దచదువు లంటకపోయినా డిగ్రీలయ్యాక అన్నయ్యలకీ ఉద్యోగా లిప్పించింది. పెళ్ళిళ్ళు చేసింది. ఈ బాధ్యతలనన్నిటినీ కష్టాలని ఏనాడు అనుకోలేదు. కోడళ్ళొచ్చారు. కొడుకులు, కోడళ్ళు సుఖపెడతారనుకొంది. కాని, కొడుకులు కోడళ్ళ గుప్పెట్లో చిక్కుకుపోయారు. వాళ్ళు గుప్పిట తెరవరు. వీళ్ళు బయటకు రాలేరు. వాళ్ళు అనే సూటిపోటి మాటల్ని భరించలేకపోయింది. మా అమ్మ నోరు మెదపని గయ్యాళిట. మాటలతో కాకుండా చేతలతో పిచ్చెక్కిస్తుందిట. తడిగుడ్డతో గొంతు కోస్తుందిట. ఇల్లా నానా మాటలంటుంటే భరించలేక సొంతఇల్లు వాళ్ళ కప్పగించి నన్ను తీసుకొని అద్దె ఇంట్లోకి చేరింది. అక్కడ డిగ్రీ చదువు లేదు. ఇంటరు అయిపోయాక న న్నిక్కడ చేర్పించింది. డిగ్రీ మొదటి సంవత్సరం అయిపోయిన తరవాత మా అమ్మకి జబ్బు చేసింది. ఎట్లాగో కష్టపడి ఉద్యోగాని కెడుతూ ఇంకో ఏడాది ఈడ్చింది. తరవాత ఆయాసం ఎక్కువైంది. హార్ట్ ఎన్‌లార్జ్ అయింది. బి. పి. పెరిగింది. అసలే విశాల హృదయం ఇంకాస్త విశాలం అయిందన్నమాట. తెలిసిన వాళ్ళు నలుగురూ గడ్డి పెడితే మా అన్నలు మాఅమ్మని తీసుకెళ్ళారు. ఇంక అసలైన కష్టాలు మొదలయ్యాయి మాఅమ్మకి. మావదినలు అమ్మని సూటీ పోటీ మాట లంటారు. 'ఈవిడెలాంటిదో మరి. లేకపోతే నిక్షేపంలాంటి కాపురం వదులుకొని ఎందుకు పోతాడు ఆ మనిషి?'

ఒక్క చిన్న సంపాదనతో పిల్లల్ని చదివించి, ఇల్లు కట్టడం జరిగే పనా? పాపం పుణ్యం మాకు తెలీదుకాని, నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. 'ఈవిడ మంచానపడింది. ఇంకెన్నాళ్ళో మా కీ ఊడిగాలు. ఆ మంచం వదిలి పోనంటోంది ప్రాణం-ఇలాంటి మాటలు అని మా అమ్మ హృదయాన్ని తూట్లు పొడుస్తూనే ఉన్నారు. మాఅమ్మ హృదయం విశాలం అవుతూనే ఉంది. కంటి నీరు ఒంటికి చేరుకుంది. 'అమ్మా చదువు మానేస్తాను. ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ నిన్ను నా దగ్గర అట్టిపెట్టుకుంటానంటే నసేమిరా వీలుకాదు. ఫైనలియర్‌లో కొచ్చి మానేస్తావా ఆ కాస్త పూర్తి చెయ్యాలని పట్టు పట్టింది.

"రుబ్బుడు రోలు రుబ్బుడు రోలే"
ఐనప్పటికీ మీరు క్రొత్త సిపిసి ప్రీమియర్
వెట్ గ్రైండరును యింతవరకు చూచివుండలేదు గదా



తిన్నని విధమైన గ్రైండరు

మీరు చెప్పేది ఒక విధంగా నిజమే కూడా—మూడు వంతుల వెట్ గ్రైండర్లలో, పిండి రుబ్బితే, రుబ్బుడు రోలులో రుబ్బిన మాదిరిగా రాదు - సిపిసి ప్రీమియర్‌లో తప్పించి.

అతి పరామరికతో తయారు చేయబడ్డ యిది, మీ సకల విధములైన అవశ్యకతలను దృష్టిలో వుంచుకొని రూపొందింపబడింది.

బాగా ఎక్కువ బరువును భరించగల శక్తివంతమైన బాల్ బేరింగు, సులువుగా కక్కు అరిగిపోని దారుఢ్యమైన రుబ్బుడు పత్రం, దీర్ఘకాలం సేవ చేయ ఆదాయకరమైన సిపిసి ప్రీమియర్ మోటారు, దృఢమైన ఎవర్‌సిల్వర్ బేసిన్, క్రోమియం పూత పూయబడిన భాగములు, సులువుగా శుభ్రం చేసుకొనేందుకు అందమైన బాడీ. కదలకుండా నిశ్చలంగా వుండగలందులకు గొట్టములతో నిర్మింపబడ్డ కాళ్ళు. వీటిని పొందివున్నవి సిపిసి ప్రీమియర్ గ్రైండర్లు.



పంచే విధమైన గ్రైండరు

వీటన్నిటికన్నా మిన్నగా : ఒక సంవత్సరం గ్యారంటీ.
కోయంబత్తూరు, మద్రాసు, మదురై, తిరుచ్చి, విల్లుపురం, కొచ్చిన్, చిత్తూరు, సికిందరాబాదు, బెంగుళూరు మొదలగు పట్టణాలలో గల మా కంపెనీ శాఖలలోనూ, మరితర ప్రాంతములలో మాచే అంగీకరింపబడ్డ వ్యాపారులందరి వద్ద లభించగలవు.

సిపిసి ప్రీమియర్

నూతన పసతులు, పురాతన సత్వము సమన్వయంగా ఒనగూడినది.

OBM-9365 TG

సిపిసి (పి) లిట్
కోయంబత్తూరు-641 030.

"మంచి వెట్ గ్రైండర్ను ఎంపిక చేయడం ఎలా" అను ఉచిత లీఫ్‌లెట్ కోసం మాకు వ్రాయండి.

అమ్మ నా పెళ్ళి మాట ఎత్తగానే సంబంధం చూడు. డబ్బు ఇయ్యి. పీటలమీద కూర్చోటానికి అభ్యంతరం లేదన్నాడు పెద్దన్నయ్య. పెద్దాడుండగా నా కేం పట్టిందంటాడు చిన్నన్నయ్య. ఇంట్లో వాటాల కోసం పోట్లాట. వాళ్ళ కళ్ళన్నీ అమ్మ గ్రాట్యుటీ, ఎల్.ఐ.సి. పాలిసీ, ప్రావిడెంట్‌ఫండ్ డబ్బుమీదే. ఆ డబ్బు వాళ్ళకే రాసిమ్మని జోరీగల్లాగ ఒకటే రొద! ఇదీ మావరి స్థితి. ఇంటి కెడితే వదినెల మాటలు. మాటలు కాదు. ఈటెలు. పోనీ ఇక్కడే ఉందామంటే అమ్మని నిర్దాక్షిణ్యంగా ఆ రాబందుల కొదిలేసి ఉండలేను. అన్నయ్యలుకూడా 'నీ డబ్బు నీ జబ్బుకే ఖర్చు పెడదాం. ఇవ్వరాదా? మే మేం తింటామా అని శతసహస్రపోరు. ఇప్పుడు చెప్పండే నా సమస్యకి పరిష్కారమేమిటో?"

ఎవ్వరూ మాట్లాడలేదు.

"పరిష్కారం చెప్తానన్నావు. ధైరం చెప్తానన్నావు. ఊరడిస్తానన్నావు. సానుభూతి చూపిస్తానన్నావు. ఏమైందే సువర్ణా! నోరు పెగలట్లేదేం?" సువర్ణ తలొంచుకుంది. ఏం మాట్లాడలేదు.

"ఏం మంజూ! నువ్వేం మాట్లాడవెందుకే? మీ ఇద్దరి హృదయాలూ బరువెక్కాయా? మెదడు మొద్దుబారిందా? లేక మనం చూసిన సినిమా కంటే నా కథే బాగుందా?" పకపక నవ్వుతున్న మాలతిని విస్తుపోయి చూస్తున్నారు మిగతా ఇద్దరూ.

"గుండె మండిపోతుంటే ఎల్లా నవ్వగలుగుతున్నావే మాలూ?" సువర్ణ పెదవులు పలికాయి.

"ఇది నాకు మామూలే. నవ్వకుండా ఎన్నాళ్ళుండగలను? నిజానికి మన దేశంలో మూడింట రెండొంతులమంది నాలాంటి వాళ్ళే ఉన్నారంటే అతిశయోక్తి కాదేమో? కష్టాలతోటే కాపురం. సంతోషం కొందరికి ఏడాదికో సారి వచ్చే వసంతం! కొందరికి పన్నెండేళ్ళకోసారి వచ్చే పుష్కరం. మరి కొందరికి పాతికేళ్ళకో సారి వచ్చే జూబిలీ. మేము కష్టాలని నమిలి మింగాలి, లేదా గటగట తాగాలి జీర్ణించుకోవాలి. అవి మారక్తనాళాల్లోకి శోషణ చెంది కండరాలని కరిగించాలి." మాలూ మామూలుగా నవ్వింది. సువర్ణ కళ్ళు వర్షించాయి. "అదేమిటే నీ కళ్ళవెంట ఈ అకాల వర్షం. సువర్ణ అంటే మంచి వర్షం కాదే! మల్లెపువ్వు. నీ జీవితంకూడా తెల్లగా మల్లెలా మెరుస్తూ స్వచ్ఛంగా ఉండాలి. సువాసన వెదజల్లాలి. అంతే." సువర్ణ కన్నీటిపొరల మధ్యనుంచి చిన్నగా నవ్వింది.

"మంజూ! నీ కేం సమస్యలు లేవా? ఉంటే చెప్పవే. మే మిద్దరం కలిసి పరిష్కరించి పారేస్తాం." మాలూ పరిస్థితిని తేలిక చేసే ప్రయత్నంలో అంది. ఏం చెబుతుందో వినాలన్న ఆత్రుత సువర్ణ ముఖంలోంచి తొంగి చూసింది.

"మాలూ! నీకున్నంతటి జటిల సమస్యలేం లేవే నాకు! మీ ఇద్దరికి ఆవరేజ్ నేను. నేను చెప్పుకోదగ్గ కష్టాలు లేవు. చెప్పుకోదగిన సుఖాలు లేవు. అన్నయ్య, నాన్న సంపాదిస్తున్నారు. అమ్మ పొదుపుగా ఖర్చు పెడుతుంది. అన్నయ్య జాబ్‌లో చేరి ఏడాది కూడా కాలేదు. జాబ్ వచ్చిన కొన్నాళ్ళకే పెళ్ళి చేశారు. ఎప్పుడైనా అమ్మ వదిన మాట మాటా అనుకున్నా వదినని అన్నయ్య చిన్నగా మందలిస్తాడు. నాన్న-చిన్నపిల్ల మాటలు పట్టించుకోకు. మన గౌరవం మనమే దక్కించుకోవాలని-అనునయంగా చెబుతారు. వదిన ఏమనుకోకండత్తయ్యా అంటుంది. పోన్లేమ్మా నువ్వన్న మాటలో తప్పేముంది' అని అమ్మ సర్దుకుంటుంది. నాన్నని అందరూ చాలా గౌరవిస్తారు. ఆయన ఎదురుగా ఎవ్వరూ గట్టిగా కూడా మాట్లాడరు. కాని, మాకు టి.వి. లేదు. స్కూటర్ లేదు. గ్రైండర్ లేదు. వాషింగ్ మిషిన్ లేదు. డైనింగ్‌టేబుల్ లేదు. ఫ్రిజ్ లేదు. ఇప్పుడంటే అన్నయ్య సంపాదన వచ్చింది కాని, అంతకు ముందు నాన్న ఒక్కరి సంపాదనేగా! ఇంటద్దెకి, తిండికి, చదువులకి, బట్టలకి, ఇన్సూరెన్సుకి, బొటాబొటిగా సరిపోతుంది. అంతో ఇంతో మిగిలితే మా నాన్నగారు 'అన్‌టచబుల్‌ఫండ్‌లో' వడేస్తారు. ఒకసారి ఆ ఫండులో వేశాక దాన్ని చిన్నచిన్న అవసరాలకి తియ్యరు. పెద్ద అవసరాలేం రాలేదు. ఆ డబ్బు ముట్టుకోనూ లేదు. అదో పదిహేనువేల పైనే అయిందట. మొన్న మా నాన్న మా అమ్మని మెచ్చుకుంటూ అన్నారు. "నువ్వు పొదుపుగా సంసారాన్ని ఈదుకు రాబట్టి ఈ ఫండ్ డబ్బు పదిహేనువేలయింది. వీడి సంపాదనకూడా వచ్చిందిగా. ఇంక గబగబ పెరుగుతుందిలే అన్నారు."

ఎన్నో సుడిగుండాలున్న అగాధం, కదలక మెదలక, నిశ్చలంగా ఉన్న సరోవరం, గలగలపారుతూ ఎత్తునుంచి కిందకి దూకుతూ వెలుగునిచ్చే విద్యుత్తుని పుట్టించే జలపాతం ఆ ముగ్గురి మనోఫలకం మీద ఒక్కసారి మెదిలాయి. ప్రకృతి భూదేవతకి మెరుపుచుక్కలున్న నల్లచీర కడుతోంది. పార్కులో జనం పలచబడుతున్నారు.

"చాలా సేపే కబుర్లు చెప్పుకున్నాం. ఇంక పోదాం పదండి" మాలూ మొదట లేచింది. ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నారు.


** ** **

"అమ్మా! ఎంత అన్యాయం చేసిపో యావమ్మా మమ్మల్ని దిక్కులేని వాళ్ళని చేసిపోయావమ్మా దేవుడనే వాడున్నాడా అసలు? ఉంటే మాకింత కష్టం కలిగిస్తాడా? దేవుడెవరో మాకు తెలీదు. మా అమ్మే మాదేవుడు. మాగురువు. జగన్నాథంగారూ! మా అమ్మలాంటివాళ్ళని వేళ్ళ మీధ లెక్కబెట్టవచ్చండీ. మీకు తెలీని దేముంది. మా అమ్మ మమ్మల్ని ఎంత కష్టపడి పెంచిందో ఆ భగవంతుడికే తెలును పార్వతమ్మగారూ! మా అమ్మ ఏనాడూ సుఖపడలేదండీ? కడుపు కట్టుకొని మాసుఖం కోసం ఇల్లు కట్టిందండీ! మమ్మల్ని సుఖపెట్టటం కోసం కష్టాలన్నిటినీ దిగమింగిందండీ. మంచి మనస్సుకి నిర్వచనం మాఅమ్మే కదండీ!" మాలతి అన్నయ్యలు నెత్తీ నోరు మొత్తుకొని ఏడుస్తున్నారు. గోడకేసి నేలకేసి తల బాదుకుంటున్నారు. వదినలు యథాశక్తి కళ్ళు ఒత్తుకుంటున్నారు. "మా అమ్మగారు ప్రావిడెంటుఫండు, గ్రాట్యుటీ, ఎల్ఐసి, డబ్బు మాకే రాశారు. పిల్ల పెళ్ళి చేస్తామని ఆమెకి మామీద కొండంత నమ్మకం. మరి మాకు తప్పదు కదండీ! ఇంటి ఆడపడుచు-ఆమె సంతోషమే మా సంతోషం.

"ఎటొచ్చీ రికరింగ్ డిపాజిట్లు ఇరవైవేలు. ఆ పిల్ల పేర ఉంది. పదేళ్ళనాడు కొని పడేసిన స్థలంకూడా ఆమె పేరిటే ఉంది. అదో పోరంబోకు స్థలం. ధర రాదు పాడూ లేదు! ఆ స్థలం, ఆ డబ్బూ ఆ పిల్లేం చేసుకుంటుంది? మాకే ఇస్తుంది. పెళ్ళి చెయ్యాల్సింది చివరికి మేమేకదా! ఎవరికి తప్పినా సొంత అన్నయ్యలకి తప్పుతుందా? ఇంకో పదిపదిహేనువేలన్నా పైన వెయ్యాలి. ముప్పైవేలన్నా లేంది ఈ రోజుల్లో పెళ్ళేమవుతుంది?" సాగదీస్తూంది పెద్దవదిన.

"ఇప్పుడు చెరినగం తీసుకుందాం. మళ్ళీ వేసుకున్నప్పుడు చెరినగం వేసుకుందాం. తప్పుతుందా మరి? పెద్దవాళ్ళని మీకు తప్పదు. చిన్నవాళ్ళమని మాకూ తప్పదు." చిన్నొదిన సన్నాయి నొక్కులు!

తల్లి దగ్గర కూర్చుని నుదురు, బుగ్గలు నిమురుతూ మౌనంగా ఉన్న మాలతిని చూస్తుంటే సువర్ణకి చర్మం ఒలిచినంత బాధగా ఉంది. శవాన్ని అక్కడ పెట్టుకొనే బేరసారాలు, వ్యాపార వ్యవహారాలు ఏం మనుషులు! కాస్త డబ్బు దాని పెళ్ళికని దాస్తే రాబందులలాగా తన్నుకుపోదామని చూస్తున్నారు. ఆ డబ్బుకూడా లేకపోతే మాలూ గతి అధోగతే. ఆ డబ్బు కోసం దాన్ని చంపేసినా చంపేస్తారు. అమ్మయ్యో! కర్తవ్యం ఏదో కొద్దిగా బోధ పడుతున్నట్టుగా ఉంది సువర్ణకి. 'కాని, ఎట్లా? దాంతో ఏకాంతంగా మాట్లాడటానికిది సమయం కాదే! డాక్యుమెంట్లు తీసుకుని మా ఇంటికొచ్చెయ్యి మాలూ అనటానికి కూడా వీలులేని పరిస్థితి. ఆమెని తీసుకెళ్ళగానే మాలూని పట్టేస్తారేమో బలవంతంగా రాయించేసుకుంటారేమో! ఏం చెయ్యటం భగవంతుడా! దాని డబ్బు దానికి అందేలా చెయ్యి. ఈ మొసళ్ళు, తోడేళ్ళు బారినుంచి దాన్ని కాపాడు ప్రభూ! నిన్ను ప్రాధేయపడాల్సిన అవసరం నాకేనాడు రాలేదు. అందుకు కృతజ్ఞురాలిని భగవాన్! దాని పెళ్ళి కోసం వాళ్ళమ్మ దాచిన డబ్బు దాని పెళ్ళికే



ఖర్చుయ్యేలాగా చూడు స్వామీ." మనస్సులోనే ప్రార్థించింది.

"మీ అమ్మని సిటీకెప్పుడు తీసుకొచ్చారురా! ఏ హాస్పటల్‌లో చేర్చారు." కాకులరొద ఆగిన మరుక్షణం కోకిల గానం! ఎంత హాయిగా ఉంది. అంతబాధలోను మాలూ మొహం సంతోషంతో వెలిగింది. లెక్క పెట్టి నలుగురి మొహాలు మాత్రం మాడిపోయాయి.

"ఆ! నిన్ననే పిన్నీ! రాత్రి తీసుకొచ్చాం. మాలూ పోరుపడలేక అనుకో. ఆవిణ్ణి సొంతింట్లో పోనీవే! కష్టపడి కట్టుకుంది. అంటే వింటేకాదు. హాస్పటల్, ట్రీట్‌మెంటో అంటూ ఒకటే ఏడుపూ. హాస్పటల్‌లో చేర్పిన గంటలోపే ప్రాణం పోయింది. ఇటూ ప్రాణం దక్కలేదు. అటు సొంతింట్లో పోలేదు."

"మరిప్పుడింటికి తీసుకెడతార్రా?"

"లేదు పిన్నీ! ఇవుడు టాక్సీలో తీసుకెళ్ళాలంటే బోలెడు ఖర్చు. అయినవాళ్ళంతా ఇక్కడే ఉన్నారుగా. అయినా ప్రాణం పోయాక కట్టెని ఎక్కడ పారేస్తే ఏం" గొంతు చాలా తగ్గించి అన్నా మాలూ, మంజూ, సువర్ణ వినసే విన్నారు. మాలు దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. మంజూ, సువర్ణ ధైర్యం చెప్పారు. పిన్ని కళ్ళతోటే మాట్లాడింది.

"మా ఫ్రెండొకడు జాంబియా వెళ్ళాడు. ఇంకో ఏడాది దాకా రాడు. సిటీలో ఎప్పుడైనా పని ఉంటే వాడుకోవచ్చని వాడి గది తాళంచెవి తీసుకున్నా. అదిందుకుపయోగించింది. ఇది వాడి ఇల్లే." ఎంతో ఘనకార్యం సాధించినవాడిలాగా, మహోపకారం చేసిన వాడిలాగా మొహం పెట్టాడు. ఆ మొహం చూస్తే సువర్ణకి కంపరం పుట్టింది. బంధువులు, స్నేహితులు, తిన్నల కొలీగ్స్, ఫ్యాన్లు అందరూ వచ్చారు. ఆ జనాన్ని చూడగానే పెద్దన్నకి వీరావేశం వచ్చింది. తన బావమరిది చెవిలో ఏదో ఊదాడు. చిన్నన్న వెంటపడి పెద్దన్న బావమరిదిని ఏదో అడిగాడు. పెద్దన్న బావమరిది చిన్నన్న చెవిలో ఏదో ఊదాడు. చిన్నన్న ముఖం నల్లబడింది. కాని, బుర్ర జోరుగా పనిచేసింది. వెంటనే చిన్నన్న తన బావమరిది చెవిలో ఏదో ఊదాడు. ఇదరు బామ్మరుదులూ వాయువేగ మనోవేగాలతో వెళ్ళి చేతిలో పాకెట్లతో తిరిగివచ్చారు.

**వచ్చడి**

"మీరు వచ్చళ్ళు భలే రుచిగా చేస్తారే! పొద్దున్న మీరు చేసి అక్కడ పెట్టిన వచ్చడి తిన్నాను. చాలా బాగుంది..." అన్నాడు సింధూర్ పక్కింటి సుందరితో.

"అర్రే! పొద్దున్న చేసింది మీరు తిన్నారా? ఏమైందో ననుకున్నా, ఇంతకీ అది వచ్చడి కాదు. చాటకి పూద్దామని మెంతులు, కాగితాలు రుబ్బి ఉంచాను. మీ రది తిన్నారు" అసలు సంగతి చెప్పింది సుందరి.

-బి. రాము

"చెల్లాయ్! ఇది అమ్మకి కట్టు. సరూ! చెల్లాయికి సాయం చెయ్యి!"" భార్య ఆజ్ఞాపించినట్టుగా అన్నారు. పెద్దవదిన పాకెట్ విప్పింది. ముదురు ఆకువచ్చ బెనారస్ చీర. నిండా పెద్ద పెద్ద జరీపూలు అరచెయ్యి వెడల్పున జరీబార్డరు. "పోనీ పైన కప్పమంటారా?" సరూ సణిగినట్టుగా అంది. "కాదు కట్టాలి! అమ్మకి పెద్దకొడుకు కోడలుగా మనం ఇచ్చే ఆఖరు కానుక ఇదే!" చిన్నన్న పాకెట్‌లోంచి ముఖమల్ దుప్పటి విడుదలై వచ్చింది. తెల్ల వెల్వెట్ మీద ఎర్రపూలు. ధగధగ మెరుస్తున్నాయి! నిలువెత్తు గులాబిదండ. గంపెడు గులాబిపూలు. "అమ్మకి మనం ఇచ్చే ఆఖరు కానుక ఇదే విజ్జూ." చిన్నన్న గొంతు పూడుకుపోయింది. "అవునండీ ఎంత చేసినా ఆవిడ ఋణం తీర్చుకోలేనిది" మాలూ తల్లిని చూడటం మాసేసి అన్నల్ని వదినల్ని మార్చి మార్చి చూస్తోంది.

"ఇప్పుడెందుకు రా ఇవన్నీ? ఇంత ఖరీదైనవి తెచ్చారని ఆవిడేమైనా చూసేనా, సంతోషించేనా" పిన్ని మెల్లిగా అంది. ఆ మాట ఎవరంటారా అని కాచుక్కూర్చున్నట్టుగా ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"అదేమన్నమాట పిన్నీ! ఖరీదు కట్టలేని తన ప్రాణాన్నే మాఅమ్మవణంగా పెట్టి మమ్మల్నింతటి వాళ్ళని చేసింది. మేము చేసిందో లెఖ్ఖా!"

ఎంత షో చేస్తున్నారు అన్నయ్యలు! ఆమె సంపాదించుకున్న డబ్బుకూడా ఆమె ఇంజక్షన్లకీ, మందులకి ఖర్చు పెట్టలేదు. సిటీకి తీసుకెడతాం అని వారం రోజులనుంచి పోరినా దిక్కులేదు. పూర్తిగా ముంచుకొచ్చాక పోరు భరించలేక అప్పుడు తీసుకొచ్చారు. అమ్మమీద ఉండే గౌరవం కొద్దీ వీళ్ళంతా వస్తే అమ్మంటే తమకెంత ప్రేమ ఉందో ప్రదర్శించుకోవటానికి వీళ్ళు ఈ అవకాశం జారవిడుచుకోలేదు. అమ్మ వక్కన కూర్చుని తల నిమరటం తప్ప తనేం చెయ్యలేకపోతోంది. వాళ్ళేమో పోటీపడి ఖరీదైన ప్రేమని చూపించారు. ఆమె కథ ముగిసింది.

చెల్లెలి రికరింగ్ డిపాజిట్ కోసం, ప్లాటు కోసం అన్నలు పడరాని పాట్లు పడ్డారు. అనరాని మాటలన్నారు. కాళ్ళు కీళ్ళు ఊడగొటి సంతకం పెట్టిచుకోగలం అన్నారు. పిన్ని ఇంట్లో ఉందామనుకుంటున్నావుగా! ఇద్దరూ కలిసి వేశ్యాగృహం నడవండి. మంచి లాభసాటి బేరం. గూండాలని పంపించి మీ జీవితాలు సర్వనాశనం చెయ్యగలం తెలుసా? అన్నలన్న మాటల్లో ఇవీ కొన్ని. నోరు మెదవకుండా సూట్‌కేసులో బట్టలన్నీ సద్దుకొని రిజిస్ట్రేషన్ కాగితాలూ, పాస్‌బుక్కు తీసుకొని పిన్ని వెంట వెళ్ళిపోయింది మాలూ.

సువర్ణకి ఇప్పుడే ప్రపంచం కొన్త కొన్త అర్థం అవుతున్నట్లుగా ఉంది. కాలెండరులో ఒక్క కాగితం అవసరం తీరిపోయింది. ఒకనాడు మంజూ తండ్రి ప్రాణవాయువు అనంతవాయువుల్లో కలిసిపోయింది. కుర్చీలో కూర్చుని న్యూస్ పేవర్ చదువుకుంటున్న మనిషి అల్లాగే వక్కకి ఒరిగిపోయారు. డాక్టర్లు మాసివ్ హార్ట్ఎటాక్ అని నిర్ధారించారు. అదృష్టవంతుడు బాధపడకుండా పోయాడని కొందరంటే నాల్రోజులు మంచం మీదుంటే సేవ చేసుకున్నామన్న తృప్తి అయినా ఉండేది పాపం వీళ్ళకి చెప్పాపెట్టకుండా పోయాడని కొందరన్నారు.

వార్త తెలియగానే సువర్ణ మంజూ వాళ్ళింటికెళ్ళింది. మంజూ మౌనంగా తండ్రి తల దగ్గర కూర్చుంది. మంజూ వాళ్ళమ్మ కొడుకు తోటి తగ్గు స్వరంలో అంది. "మీ నాన్న విల్లు రాశార్రా! తను పోయాకే తెరవమని శాసించారు. బీరువాలో ఉంది తేరా!'

"విల్లా! నాన్న రాశారా?" చాలా ఆశ్చర్యపోయాడు కొడుకు. తీసుకొచ్చి గట్టిగా చదివాడు.

"1. నా కళ్ళు దానం చెయ్యాలి. కంటిఆస్పత్రి డాక్టర్లకి ఫోను చెయ్యండి. తగిన ఫారాలన్నీ నేను ముందే నింపాను.


2. నా శరీరాన్ని మెడికల్ కాలేజీకి ఇచ్చెయ్యండి. శరీరంలోని భాగాలను పరిశోధనలకని తీసుకోనియ్యండి. అభ్యంతరం పెట్టద్దు.

రకరకాల కణజాలాలు వాటి నిర్మాణాలు, వాటికి వచ్చే రోగాలు నివారణోపాయాలు తెలుసుకొంటారు. గుండె, ఊపిరితిత్తులు, కాలేయము, క్లోమము, మూత్రపిండాలు, జీర్ణకోశము మొదలైన వాటికొచ్చే కొన్ని రోగాలు అంతు పట్టట్లేదు. అదే నా ఈ కోరికకి ముఖ్య కారణం. పరికరాలున్నా పదార్థం లేనిదే వాళ్ళెలా పరిశోధనలు చేస్తారు?

3. మెడికల్ విద్యార్థులు అస్థిపంజరాన్ని అధ్యయనం చేస్తారు. అస్థిపంజరాలు కరువై ప్లాస్టిక్ అస్థిపంజరాల నుపయోగించి చదువుతున్నారట. కాల్చి తగలేస్తే ఆ బూడిద దేనికి ఉపయోగిస్తుంది?

4. తర్పణాలు వదలద్దు. తద్దినాలు పెట్టద్దు. నా దృష్టిలో ఈ చరిత్ర ఇంతటితో ముగుస్తుంది. పునర్జన్మలని నేను నమ్మను.

నా వరంగా వచ్చే డబ్బు మీ రెట్లాగూ సద్వినియోగం చేస్తారనే నమ్మకం నాకుంది. డబ్బుని గురించి ప్రత్యేకంగా రాసేదేమీ లేదు. నా శరీరం



మీ అధీనంలో ఉంటుంది. ఆయన శరీరం ఆయన ఇష్టం! అని మీరు అనుకుంటే నా కోరిక తీర్చండి. పరోపకారార్థమిదం శరీరం।"

మంజూ అన్నయ్య చదవటం పూర్తిచేశాడు. గుండెలు బాదుకొని ఎవ్వరూ ఏడవలేదు. కాని, అందరూ శోకదేవతలకి ప్రతిరూపాలుగా ఉన్నారు.

తండ్రి ఇష్టప్రకారమే అంతా జరిగింది. బంధువులంతా విడ్డూరంగా చెప్పుకున్నారు. కొడుకులుండికూడా ఆయనకి సద్గతులు కలిగే అదృష్టం లేదన్నారు. మరమనిషి అన్నారు. అంతా ఉండి అనాథశవంలాగా ఆస్పత్రిపాలయ్యా డన్నారు. ఆయ నేదో విపరీతమైన కోరిక కోరితే వీళ్ళు తీర్చటమేమిటి బుద్ధిలేక అన్నారు. దయ్యమై తిరుగుతాడన్నారు. ఆయనని బాగా అర్థం చేసుకున్న స్నేహితులు మాత్రం ఆయన్ని మెచ్చుకున్నారు. పరోపకారార్థ మిదం శరీరం అన్న సూక్తిని బాగా వంట పట్టించుకున్నాడని, చాలా ప్రాక్టికల్ మనిషని, ఆయనకి ఆయనే సాటి అని మనఃస్ఫూర్తిగా చేతులెత్తి నమస్కరించారు.

బరువెక్కిన మనస్సుతో సువర్ణ ఇల్లు చేరింది. జరిగిందంతా అమ్మకీ, నాన్నకీ పూసగుచ్చినట్లు చెప్పింది.

"డాడీ..."

"ఏం టూటీ?"

ఎడమచేతి చిటికిన వేలి గోరుని కుడిచేత్తో గిల్లుతూ కూర్చుంది.

"డాడీ..."

"ఏంటమ్మా...ఏమిటీ...ఏదో చెప్పటానికి సందేహిస్తున్నావు."

"నేను పోయాక నా శరీరాన్నికూడా మంజూవాళ్ళ డాడీలాగే..."కూతురి మొహంలో కనిపించిన దృఢ గంభీర నిర్ణయానికి తండ్రి చకితుడయ్యాడు. తల్లి అదిరిపడింది. "నోర్ముయ్ టూటీ! చిన్నింటికి పెద్ద శోకం అని వెధవవాగుడూ, నువ్వూనూ. స్నేహితురాలికింత కష్టం వచ్చిందని పోనీ పలకరించి వస్తావని పంపిస్తే అన్నీ పిచ్చి మాటలు మాట్లాడుతున్నావు. అలా మాట్లాడితే అనవ్యాం నాకు." తల్లి కోప్పడింది.

"అమ్మలాగా నే నలా కోప్పడను టూటీ! మరణం తప్పదని తెలిసీ, జీవితానికిది చరమ ఘట్టం అని తెలిసీ దానికంత భయపడి గోల చేస్తారెందుకూ! భయపడ్డంత మాత్రాన తప్పుతుందా? నా ఈ జీవితం తరవాత ఏమిటి అని ఆలోచించటంలో తప్పేం లేదు. కాని, ఒక్క విషయం మరిచిపోతున్నావు. టూటీ! మేము నీ పైతరంవాళ్ళం. మామూలుగా అయితే మేమే ముందు వెళ్ళిపోవాలి. అందుకని నేనుకూడా మంజూ డాడీలాగే రాసి ఉంచుతాను. నీ సంగతంటావా! నీ పెళ్ళయ్యాక మీ వారికీ, నీ పిల్లలకీ చెప్పు. పెళ్ళయిన వెంటనే చెప్పకు సుమా! మీ శ్రీవారు పాపం జడుసుకుంటాడు. మరణానికి వయస్సుతో సంబంధం లేదు కనక నే ననుకునేదానికి భిన్నంగా జరిగితే నీ ఇష్టప్రకారం జరుగుతుంది. మీ అమ్మ విషయంలో నేను కల్పించుకోను. ఆమె ఇష్టం."

"ఛీ ఛీ! నిండు ఇంట్లో ఏమిటా అవాచకం మాటలు. ఇంకో టాపిక్ దొరకలేదా? ఆ ఇంటికి ఇల్లు తోడాయె నమ్మా అని చాల్బాలు ఇంక అందరూ నోళ్ళు మూసుకోండి ఈ మొద్దుపిల్లే ఈ గొడవంతా తెచ్చిపెట్టింది." తల కొట్టుకుంది. సువర్ణ తల్లి.

"చూడు దేవీ! నువ్వెందుకంత అప్సెట్ అవుతున్నావో నాకు తెలీట్లేదు. సినిమాకీ, డ్రామాకీ చివరి సీను ఉన్నట్టే ప్రతిమనిషి జీవితానికీ చివరి సీను ఉంటుంది. కావాలన్నా వద్దన్నా ఏడ్చినా, బాధపడినా అది నిత్యసత్యం తప్పదు. ఆ కాస్త కీ రభస ఎందుకు? మీ మమ్మీకి ఇష్టంలేని టాపిక్ ఇంక వదిలెయ్యి టూటీ! కాని, ఒక సంగతి చెబుతాను. మనం జీవించి ఉన్నప్పటి సంగతి. ఇంకణ్ణించి మన ముగ్గురం ప్రతి ఆరు నెలల కొకమాటు రక్తనిధి కేంద్రానికి వెళ్ళి స్వచ్ఛందంగా రక్తదానం చేద్దాం. మృత్యుముఖంలో ఉన్న కొందరినైనా రక్షించవచ్చు. సరేనా! ఏమైనా అభ్యంతరమా దేవీ!

"నాకేం అభ్యంతరం లేదు! మీ ఇష్టం. అవాచకం మాట్లాడకుండా ఉంటే చాలు.'

"నేను రెడీ డాడీ" సువర్ణ ఎగిరి గంతేసింది.

"ఓకె. ఓకె."

"మరి నే నెందుకొద్దు డాడీ!" పవన్ కోపంగా అడిగాడు.

"నువ్వు ఇంటర్మీడియట్ కదా! అంటే పూర్తిగా పెద్దవాడివి కాలేదన్నమాట. డిగ్రీ పూర్తయ్యాక నువ్వూ ఇద్దువుగాని సరేనా!" డాడీ నచ్చచెప్పారు.

తండ్రికి కూతురు హిమాలయాలంత ఎత్తుకి ఎదిగినట్లు కనిపిస్తే కూతురుకి తండ్రి ఆకాశమంత ఎత్తులో కనిపించాడు.

"నా చీరనల్లా తొక్కుకుంటూ పోతావేంరా కళ్ళు కనిపించవా? తన్నాలి పట్టుకొని నిన్నూ...అసలూ..."అని వెంటపడి తరుముతున్న సువర్ణ పవన్‌కి మాత్రం మామూలుగానే కనిపించింది.

# వ్యాయామం-క్రీడలు


"వ్యాయామ, క్రీడా రంగాలలో పాల్గొన్నట్లయితే పిల్లలు చెడిపోతారు" అని ఆ రోజుల్లో పెద్దలన్నారు—ఈ రోజుల్లో కూడా అంటున్నారు.

వ్యాయామం ఈనాటిది కాదు. భారత, రామాయణ కాలాలనుంచి వ్యాయామానికి ప్రాధాన్యముంది. ఆ రోజుల్లో వ్యాయామం వల్ల బలాఢ్యులయ్యారు స్త్రీ, పురుషు లందరూ. అదేమంటే అవి పురాణా లన్నారు. కాని ఈనాటికీ అంతకు మించిన బలాఢ్యులు ఆనాటి పురాణాలను రుజువు చేస్తున్నారు. అదేమంటే—అందరికీ ఏ విధంగా సాధ్యమవుతుంది? అని ప్రశ్నిస్తారు. అది కూడా నిజమే. అందరూ బలవంతులు కాలేరు. కాని మానవ ప్రయత్నం చేయాలి.

చిన్నప్పటి నుంచి ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి. వ్యాయామంవల్ల బ్రతికినంత కాలం ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉంటారనే యథార్థాన్ని గుర్తించాలి. వ్యాయామం అనేక రకాలు. అవి అందరికీ సాధ్యం కావు. ఉదయం లేవగానే కనీసం ఒక్క మైలు నడవడం కూడా వ్యాయామమే. ఆమాత్రం చేయలేరా? అదివరలో ప్రతి పాఠశాలలోనూ డ్రిల్లు క్లాసు లుండేవి. అవి చాలా కఠినంగా ఉండేవి. విద్యార్థులచేత డ్రిల్లు, దండాలు, బస్కీలు, పిరమిడ్లు చేయించేవారు ఆనాటి డ్రిల్లు మాస్టర్లు. ఈ రోజు అవన్నీ కరువైపోయాయి. డ్రిల్లు మాస్టర్లను చూస్తేనే భయం కలిగేది ఆ రోజుల్లో. ఆ వ్యాయామమే క్రీడారంగ ప్రవేశానికి నాంది అయింది.

ఆ రోజుల్లో అనేక వ్యాయామ శాల లుండేవి. వ్యాయామ ప్రవీణులు యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చేవారు. ఆ శిక్షణవల్లనే ఎంత వయస్సు వచ్చినా, దృఢంగా నిలబడ్డారు అనేక మంది యువతీ, యువకులు. వ్యాయామంవల్ల వ్యాధులు దగ్గరకు రావు అని రుజువు చేశారు కొందరు మహానుభావులు. ఆదినుండి పల్లెలలో కూడా వ్యాయామానికి ప్రాధాన్య ముండేది. పల్లెల్లో అనేక పోటీలు—కబాడీ, ఖోఖో, కుస్తీ, ముష్టియుద్ధం, బండ్ల పందాలు, ఈత మొదలైనవి జరిగేవి. రాత్రిళ్ళు వెన్నెల రోజుల్లో కూడా ఆటలాడుకునేవారు.

వ్యాయామంవల్ల విద్యార్థీ, విద్యార్థినులకు బుద్ధిబలం కూడా పెరుగుతుంది. క్రమశిక్షణ అలవాటు పడుతుంది. యువతీ, యువకు లీనాడు ఉసూరుమంటూ ఎందుకూ పనికిరాకుండా పోతున్నారు. ఉదయం పెందలాడే నిద్ర లేచి, ఏదో ఒక వ్యాయామం చే సేవాళ్ళు ఎంతమంది ఉన్నారో చూడండి. ఏ పనీ పాటా లేకుండా బద్ధకస్థులైపోతున్నారు చాలా మంది. వ్యాయామంవల్ల ఉపయోగం ఏమిటో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. మేధాశక్తిని శారీరక శక్తితో పదును పెట్టుకోవాలని అందరూ గుర్తించాలి.



భీమవరం కళాశాల విద్యార్థుల చేత డ్రిల్లు చేయిస్తున్న ఆ నాటి వ్యాయామ అధ్యాపకులు శ్రీ జె. నారాయణమూర్తి

-"ఏకా"